

31న వాహనాల వేలంపాట

పులివెందుల రూరల్ : పులివెందుల స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 31న వేలంపాట నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ



సీకేదిన్నెలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొలుములపల్లిలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ కె.నాగరాజు తనిఖీ చేసి డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్ ద్వారా జరుగుతున్న కార్యక్రమాలను, ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం సీకేదిన్నెలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి కౌన్సిలర్ కోడిరమణ రూ.లక్ష విరాళాన్ని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ వారికి అందజేశారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్‌లెస్ట్ డైరెక్టర్ గంగాధరరెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లి కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీకి విరాళాన్ని అందజేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్









పేదలకు ఆర్థిక సాయం


పులివెందులలో కేక్‌నుకట్ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు


వేములలో వికలాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మండల ఇన్‌చార్జి

పులివెందుల టౌన్ : పట్టణ పరిధిలోని జయమ్మ కాలనీలో నివాసముంటున్న పేద ముస్లిం చాంద్‌బాషా కుమార్తె పెళ్లికి నేడు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లిం మైనార్టీ వైసీపీ నాయకులు నూరుల్లాహ్ వారికుటుంబ సభ్యులకు రూ.10వేలు నగదును శనివారం అందజేశారు. అలాగే స్థానిక మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి నివాస ఆవరణలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలను నిర్వహించారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్‌లు కేక్‌ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు. రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కోడిరమణ, పార్నపల్లె కిశోర్, జేసీఎస్ చంద్రమౌళి, సిద్ధయ్య, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు దుస్తుల పంపిణీ

వేముల : స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం నేడు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదిన సందర్భంగా వికలాంగులకు వైఎస్సార్సీపీ నాయకులు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆలయంలో వైఎస్సార్సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు మరకా శివకృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజారెడ్డి, సర్పంచ్ రామాంజనమ్మ, వెంకటనారాయణలు ప్రత్యేక పూజలు చేసి అనంతరం కేక్‌ను కట్‌చేసి అందరికి పంచిపెట్టారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత

లింగాల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నేడు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు.

పెండింగ్ పనులను పూర్తిచేయాలి

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ హఫీజ్‌లు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎక్కడైనా పనులు పెండింగ్‌లో ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పులివెందుల పట్టణంలో జగనన్న మెగా లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు ఊపందుకున్నాయన్నారు. అనంతరం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మటన్ మార్కెట్, ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో యూజీఎఫ్ పైపులైను కొరకు కాలువ తీస్తున్న నేపథ్యంలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.









రాష్ట్రస్థాయికి వల్లూరు మోడల్ స్కూల్ ప్రాజెక్టు ఎంపిక

కడప ఎడ్యుకేషన్: యూనిసెఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్ ఇన్నోవేషన్ పోగ్రాం నిర్వహించగా ఇందులో 2326 పాఠశాలలకు చెందిన 64,583 మంది విద్యార్థులు పాల్గొన్నారని జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. ఇందులో 3238 మంది తమ కొత్త ఆలోచనలతో ఇన్నోవేషన్ పోగ్రాంలో పాల్గొన్నారని తెలిపారు. వివిధ స్థాయిల్లో పరిశీలించి ఇందులో 27 మంది విద్యార్థులు తయారు చేసి 19 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారని తెలిపారు. ఎంపిక చేసిన 19 ప్రాజెక్టుల్లో వైఎస్సార్‌జిల్లా వల్లూరు మోడల్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టు కూడా ఉందన్నారు. ఈ పాఠశాలకు చెందిన గాయత్రి టీచర్ శ్వేత, నందిని, జీవన, మేఘన, సాక్షిలతో చేయించిన సెల్ఫ్ డ్రిల్ ఫామింగ్ అగ్రికల్చర్ అనే ఐడియాను అప్‌లోడ్ చేశారన్నారు. ఈ ఐడియాను పరిశీలించిన పరిశీలకులు వీరి నమూనాను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారాన్నరు. రాష్ట్రస్థాయికి ఎంపికైన 19 ప్రాజెక్టుల విద్యార్థులకు, వారి గైడ్ టీచర్లకు విజయవాడలో శాస్త్రవేత్తలతో బూట్ క్యాంపును ఈ నెల 28,29 తేదీల్లో నిర్వహిస్తారని తెలిపారు. వీరికి ఈనెల 30వ తేదీన రాష్ట్ర స్థాయి పోటీ ఉంటుందని తెలిపారు.

గండికి తరలివచ్చిన భక్తజనం

ఘనంగా శ్రావణమాస రెండో శనివారోత్సవం



క్యూలైన్‌లలో బారులు దీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

చక్రాయపేట : గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో శ్రావణమాసం రెండో శనివారోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకుని తరించారు. గత వారం కంటే ఈ సారి భక్తులు ఎక్కువగా వచ్చారు. వాహనాలు అధికంగా రావడంతో గండిలో సుమారు గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు కొద్ది సేపు వీరన్నగట్టుపల్లె, అద్దాలమర్రి క్రాస్ వద్ద వాహనాలు ఆపేశారు. దీంతో సమస్య తీరింది. ఉదయం నుంచి సాఫీగా ఉండిన క్యూలైన్లు మధ్యాహ్నం ఒక్కసారిగా నిండిపోయాయి. పలువురు భక్తులు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలా చార్యులు ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. కడప సర్వజన ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. చక్రాయపేట ప్రభుత్వ వైద్యశాల తరపున వైద్య శిబిరం నిర్వహించి అస్వస్థతకు గురైన వారికి సత్వరం చికిత్సలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, వేంపల్లె జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. రెండవ శనివారం సుమారు 25 వేల మంది వరకు భక్తులు స్వామిని దర్శించుకొని ఉంటారని ఆలయ వర్గాల అంచనా. పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్, ఆర్కేవ్యాలీ, పులివెందుల రూరల్ సీఐలు గోవిందరెడ్డి, రాజు, ఆర్కేవ్యాలీ ఎస్సై రంగారావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. భక్తుల కాలక్షేప నిమిత్తం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి.

అంజన్న సన్నిధిలో ప్రముఖులు

శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, కమలాపురం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి గండికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారితోపాటు పాలకమండలి ఆధ్వర్యంలో అర్చకులు వారిచే ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

లారీ, బైక్ ఢీకొని యువకుడి దుర్మరణం

ఎర్రగుంట్ల : పెన్నానది ఒడ్డున ఉన్న అయ్యప్పస్వామి దేవాలయం వద్ద శుక్రవారం అర్ధరాత్రి లారీ, బైక్ ఢీకొనడంతో గురుప్రసాద్ (17)మృతి చెందగా, దస్తగిరి అనే యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన మేరకు.. పోట్లదుర్తి గ్రామానికి చెందిన గురుప్రసాద్, దస్తగిరిలు శుక్రవారం బైక్‌పై ప్రొద్దుటూరు నుంచి స్వగ్రామమైన పోట్లదుర్తికి వస్తుండగా చెక్‌పోస్టు వద్దకు రాగానే బైక్, లారీ ఢీకొన్నాయి. వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా గురుప్రసాద్ మృతి చెందాడు. దస్తగిరిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. మృతుడి తండ్రి గుర్రప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రగతి పథంలో కడప



చెమ్ముమియ్యాపేటలో పార్కును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : దేశంలో ఎన్నడు జరగలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ బి అంజద్‌బాషా పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సాధారణ నిధుల నుంచి స్థానిక చెమ్ముమియ్యాపేటలో బ్రిడ్జి కింద రూ.1.60కోట్ల వ్యయంతో పార్కు, ఐటీఐ సర్కిల్ వద్ద 13.35లక్షలతో గాంధీ పార్కు, బాలాజీ నగర్‌లో రూ.20.42లక్షలతో హిందూ శ్మశానవాటికల అభివద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి ఎస్ బి అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డిలు ప్రారంభోత్సవాలు చేశారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ చెమ్ముమియా పేట ప్రాంతంలో సుమారు 2 కోట్ల వ్యయంతో ఒక పార్కును ప్రారంభోత్సవం చేయడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా 44వ డివిజన్ పరిధిలో గాంధీ విగ్రహం వద్ద రూ. 13.35 లక్షల వ్యయంతో గాంధీ పార్కును ప్రజల కోసం తీర్చిదిద్దామన్నారు. ప్రజలందరూ ఈ పార్కులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఒక్క కడప నగరంలోనే సుమారు రూ. 2000 కోట్ల రూపాయలతో అభివద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి రిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేశారని, ఆయన తనయుడైన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రిమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా మార్చారన్నారు.మరో మూడు ఆస్పత్రులను ఏర్పాటు చేసి డిసెంబర్ లోగా పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, 45వ డివిజన్ ఇన్‌చార్జి జి. శ్రీనివాసులరెడ్డి, 44వ డివిజన్ కార్పొరేటర్ హేమలత, డివిజన్ ఇన్‌చార్జి రామక్రిష్ణారెడ్డి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ పాకా సురేష్ కుమార్, షఫీ, బండి ప్రసాద్, తోటక్రిష్ణ, జమాల్‌వలీ, కె. సూర్యనారయాణరావు, నగరపాలక ఎస్ఈ రత్నాల రాజు, డీఈ అబిద్ హుస్సేన్, ఏఈ దిల్షాద్ పాల్గొన్నారు.

నూతన ఆలయం ప్రారంభం

చింతకొమ్మదిన్నె : ముత్తరాసువీధిలో నూతనంగా నిర్మించిన సీతారామాలయాన్ని శనివారం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా ఫలితాలు విడుదల

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించిన 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీ సీ ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి శనివారం విడుదల చేశారు.

బాధితురాలికి బంగారం అప్పగింత

జమ్మలమడుగు : పోగొట్టుకున్న రూ.3 లక్షల విలువైన బంగారాన్ని బాధితురాలికి అప్పగించిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా కొలిమిగుండ్లకు చెందిన కృష్ణవేణి శనివారం జమ్మలమడుగుకు షాపింగ్ కోసం వచ్చింది. ఈ క్రమంలో మూడు లక్షల విలువ గల 5 తులాల బంగారం ఉన్న బ్యాగ్‌ను పోగొట్టుకుంది. వెంటనే స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ సదాశివయ్య సిబ్బందిని రంగంలోకి దించారు. కానిస్టేబుల్ మధుసూధన్‌రెడ్డి, ఈశ్వరయ్య, రియాజ్‌లు బాధితురాలు తిరిగిన ప్రాంతాలను పరిశీలించారు. ఏ ప్రాంతాలలో తిరిగిందో సీసీ కెమెరాల ద్వారా తెలుసుకుని ఆమె బ్యాగ్‌ను గుర్తించారు. బ్యాగ్‌లో ఐదు తులాల బంగారం ఉంది. ఆ బ్యాగ్, బంగారాన్ని కృష్ణవేణికి అప్పగించారు. గంట వ్యవధిలోనే బ్యాగ్ గుర్తించడంతో ఎస్పీ అన్బురాజన్ పోలీసులను అభినందించారు.

కడపకు సమున్నత గౌరవం !

సాక్షి ప్రతినిధి, కడప : తిరుమల–తిరుపతి దేవస్థానం పాలకమండలి బోర్డు కూర్పులో వైఎస్సార్ జిల్లాకు సమున్నత గౌరవం దక్కింది. జిల్లావాసులు ఇద్దరికి సభ్యులుగా అవకాశం కల్పించారు. రాష్ట్రంలోని 26 జిల్లాలతోపాటు, పొరుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఆశావహులు ఉన్నప్పటికీ 24 మంది సభ్యులతో చేపట్టిన కూర్పులో ఇద్దరికి అవకాశం లభించింది. దేశానికి రాజు అయినా తల్లికి బిడ్డే అన్నట్లుగా రాజకీయంగా ఆదరించి అక్కున చేర్చుకున్న కన్నతల్లి లాంటి వైఎస్సార్ జిల్లాకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమౌతోంది. టీడీపీ పాలకమండలి బోర్డు సభ్యులుగా వైఎస్సార్ జిల్లాకు చెందిన మాసీమ బాబు (రాచుపల్లె వెంకటసుబ్బారెడ్డి), సిద్దవటం యానాదయ్యలకు అవకాశం లభించింది. కడప గడపలో ప్రజానీకానికి సుపరిచితుడైన మాసీమ బాబుకు గత పాలకమండలిలోనే ప్రత్యేక ఆహ్వానితుడిగా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించినా హైకోర్టు ఉత్తర్వుల కారణంగా ఆ నియామకం రద్దయింది. దేవదేవుని సేవ లో పాలుపంచుకునే అవకాశం చేజారడం ఒకింత నిరాశ కల్గించినా, నూతన పాలకమండలి కూర్పులో మాసీమ బాబుకు ముఖ్యమంత్రి పట్టం కట్టారు. గతంలో జిల్లాలో వరుసగా రెండు పర్యాయాలు టీటీడీ బోర్డు సభ్యులుగా ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ప్రాధాన్యత ఇచ్చారు. ఈమారు కడప, కమలాపురం నియోజకవర్గాలకు చెందిన నేతలకు అవకాశం లభించింది.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఘనంగా మదర్ థెరీసా జయంతి

వేంపల్లి : మదర్ థెరీసా జయంతి సందర్భంగా శనివారం పట్టణ శివార్లలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో జడ్పీటీసీ సభ్యులు ఎం.రవికుమార్‌రెడ్డి మదర్ థెరీసా చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జేవీ వినోద్‌కుమార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బాలస్వామి ఏర్పాటు చేసిన దుస్తులను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంపీపీ లక్ష్మిగాయత్రి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి గూడు కల్పించడమే సీఎం ధ్యేయం

సింహాద్రిపురం : అర్హత ఉన్నత ప్రతి ఒక్కరికీ గూడు కల్పించడమే సీఎం ధ్యేయమని పులివెందుల ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిషత్ సభాభవనంలో ఆయన మండల అధికారులతో, ప్రజా ప్రతినిధులతో జగనన్న ఇంటి నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. రూ.30 వేలలోపు గతంలో మంజూరైన ఇంటి లబ్ధిదారులకు ఆ మొత్తం తీసివేసి కొత్తగా ఇంటిని నిర్మించుకుంటే ఆ లబ్ధిదారులకు మిగిలిన డబ్బు మంజూరవుతుందన్నారు. అలాంటి వారు సంబంధిత ఇంజనీరు అసిస్టెంట వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లకు సంబంధించిన బిల్లులను పెట్టాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణం పూర్తి అయిన లబ్ధిదారులకు ఉచితంగా కరెంటు కనెక్షన్ కొరకు దరఖాస్తు సంబంధిత విద్యుత్ ఏఈకి అందించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సింహాద్రిపురం : స్థానిక ప్రభుత్వ పాఠశాలలో శనివారం ప్రత్యేక అధికారి నాగలింగాచారి, ఎంపీడీఓ కృష్ణమూర్తిలు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనాలను అందించాలని, భోజనాలలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని వంట ఏజెన్సీని హెచ్చరించారు.